

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 48 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'నిష్కారణంగా సాధునింద విన్నాం పొద్దున్నే' అన్నాడు సోదరులలో పెద్దవాడు నొచ్చుకున్నట్లుగా.

అతడి పేరు యోగానంద నారసింహుడు. 'అతనిలో ఏదో తేడా వున్నది' అన్నాడు సోదరులలో చిన్నవాడు. అతడి పేరు జ్వాలా నారసింహుడు.

కొంతసేపటి క్రితం తమకు తారసపడి కృష్ణమాచార్యులను నిందించిన యువకుడి గురించి మాట్లాడుకుంటూ వడివడిగా నడుస్తున్నారు ఆరుగురు అన్నదమ్ములు. అహోబిలం సమీపంలోని పాతకమూరు వారి స్వస్థలం. వారి తల్లిదండ్రులు నిరక్షరాస్యులైన గ్రామీణులు. అహోబిల నారసింహుడు వారి యిలవేలుపు. ఆ స్వామి మీది భక్తితో ఆరుగురు కొడుకులకూ ఆ నరసింహుడి పేర్లే పెట్టుకున్నారు.

నవనారసింహుల పుణ్యక్షేత్రమైన అహోబిలానికి ప్రతిరోజూ ప్రభాతసేవకల్లా చేరుకుంటారు కాలి నడకన. భయంకరమైన అడవి, కొండలు, గుట్టలు, వాగులు దాటుకుని తెల్లవారకముందే స్వామి సన్నిధికి చేరుకుంటారు. ఎగువన, దిగువన వున్న నవమూర్తులకు తమ గానంతో, నృత్యంతో సేవ

జేసుకుంటారు. తీర్థ ప్రసాదాలు తీసుకుని మరలా దారిపొడుగునా గానం చేసుకుంటూ వారి గ్రామానికి చేరుకుంటారు. అహోబిల నరసింహుడికి వారి గొంతు వినబడకుంటే తెల్లవారదు.

ఒక వర్షాకాలంలో భవనాశిని నదికి కొండల్లోనుంచి వందలాది వాగుల నీరు వచ్చి చేరింది. ఎగువన స్వామి సేవలో వున్న అర్చకస్వామి అలాగే చిక్కుపడి అక్కడే వుండిపోయాడు. వారం రోజులపాటు అన్నదమ్ములు స్వామి దర్శనానికి వెళ్ళలేకపోయారు. స్వామిని దర్శించుకోలేకపోయిన బాధతో

విలపిస్తూ అహోబిలం కొండవైపు తిరిగి మొరపెట్టుకున్నారు. మైళ్ళదూరం కనబడే ఉగ్రస్తంభానికి  నమస్కరించుకున్నారు. ఆ వారంరోజులూ యింటివద్దనే స్వామికి సంకీర్తన చేసుకున్నారు. నాట్యాన్ని చేశారు. అందులో పెద్ద విచిత్రమేమీ లేదు కానీ, ఆ వారం రోజులూ పాతకమూరు కంటికి కనిపించని సింహం చేస్తున్న గర్జనలతో దద్దరిల్లిపోయిందట.

అన్నదమ్ముల గానము, నాట్యము మొదలుబెట్టే సమయానికి ఆ గర్జనలు మొదలయ్యేవి. పూర్తి చేసి స్వామికి హారతులు యిచ్చి మంగళహారతులు పాడే సమయానికి ఆ సింహమేదో దూరంగా వెళ్లిపోతున్నట్లు గర్జనలు అంతకంతకూ దూరంగా దూరంగా వినిపిస్తూ పోయేవి. మరునాడు ఉదయం అన్నదమ్ముల సేవమొదలయ్యే సమయానికి మరలా గర్జన ధ్వనులు ప్రారంభం అయ్యేవి. ఆ వారం రోజులూ పాతకమూరు ఊరు ఊరంతా వారి యింట్లోనే గుమికూడారు. వరద తగ్గుముఖం పట్టింది, యిక మర్నాటినుండీ అహోబిలం వెళ్ళవచ్చు అనుకున్న రోజున పెద్ద విచిత్రం జరిగింది.

అన్నదమ్ముల గానం మొదలు కాగానే ఓబులేశుడనే ఒకతనికి నృసింహస్వామి పూనాడు. గర్జనలు చేశాడు. ఓబులేశుడు అంటే గిరిజనుల, గ్రామీణుల పరిభాషలో అహోబిలేశుడే! అన్నదమ్ములు తన కొండెక్కి రావడం వీలుకాదని, తనే కొండ దిగి వచ్చానని అన్నాడు. కొలుపు చేసి, శాంతింపజేశారు.

ఎప్పటిలాగే గర్జనలు దూరంగా వెళ్ళిపోయి, వినిపించడం మానేసిన తర్వాత ఆ వ్యక్తి విరుచుకుని పడిపోయాడు. మరునాడు అహోబిలం చుట్టుపక్కల ముప్పై అయిదు వూళ్ళ జనం పోగయ్యారు. ఎంత వారిస్తున్నా వినకుండా  ఆరు మేనాలలో ఆరుగురు అన్నదమ్ములను కూర్చోబెట్టారు. ఏడో దాంట్లో వారి తల్లిదండ్రులను కూర్చోబెట్టారు. ఊరేగింపుగా అహోబిలం చేరుకున్నారు. నవనారసింహుల దర్శనం చేసుకుని కొలుపులు చేశారు. అప్పటినుండీ ప్రతిసంవత్సరమూ ఆ ఏడురోజులూ అలా అన్నదమ్ములనూ, వారి తల్లి దండ్రులనూ స్వామి సన్నిధికి పల్లకీ సేవతో తీసుకెళ్లడం ఒక ఆనవాయితీ అయ్యింది.

ఆ పుణ్యాత్ములకు విచిత్రంగా కొద్దిరోజులక్రితం వారి యిష్టదైవం కలలో కనిపించాడు. అన్నదమ్ములు ఆరుగురికీ అదే కల. అందులో చిత్రమేముంది? ఆదిశంకరుల తల్లిదండ్రులిద్దరికీ ఒకే రాత్రి వృషాచలేశ్వరుడు కలలో కనిపించలేదా? అన్నదమ్ములకు కలలో కనిపించిన స్వామి 'నా పరమ భక్తుడు కృష్ణమాచార్యులు సింహాచలంలో వున్నాడురా! నా అవతారమేరా! వెళ్లి దర్శించుకోండిరా! మాట తప్పాడురా! దారి తప్పాడురా! దారి మరలించండిరా..' అని ఆదేశించాడు. అదేం విచిత్రం కాదు.

అపర శంకరుడైన ఆదిశంకరాచార్యులు అమరుక మహారాజు శరీరంలో దారి తప్పలేదా? 'తత్త్వమసి.. తత్త్వమసి' అన్న తన శిష్యుల ప్రబోధంతో తనను తాను తెలుసుకోలేదూ? పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తూ 'నీ చేయూతనిమ్మ'ని నృసింహుడిని ప్రాధేయపడుతూ కరావలంబ స్తోత్రం చెయ్యలేదూ?

పాఠకుడా! నీకేమన్నా కొత్తగా, వింతగా, అనిపించవచ్చు! ఆశ్చర్యంలేదు! నీ కండ్లూ చెవుల పరిధి అల్పం! నాకు యిదేమీ వింతా కాదు, కొత్తా కాదు! ఎన్ని చూశానని! ఇంకెంత చూస్తానని! యుగాల చరిత్రలు నాకు కేవలం కొన్ని లిప్తలు! గుర్తున్నానా? కథల కలల జడిలో కొట్టుకుపోతూ నన్ను మరిచిపోలేదు కదా? నేను కాలాన్ని! గాలాన్ని! నీ కర్మలను బట్టి అమృతాన్ని, హాలాహలాన్ని! జన్మలు, పునర్జన్మలు మజిలీలు! మాయల తెరలు! మమతలు ఎరలు!

స్వామి ఆదేశం మేరకు సింహాచలం వచ్చిన అన్నదమ్ములు ఆ మహాభక్తుడు ఎక్కడుంటాడు అన్నది తెలుసుకోడం కోసం తిరుగుతూ మరలా కొండపాదం వద్దకు చేరుకున్నారు. విశాలమైన రావిచెట్టుకింద కొద్దిసేపు ఆగి సేద దీరారు. అంతకుముందు వారికి కృష్ణమాచార్యుల యింటి జాడలను ఆ యువకుడు చెప్పినది గుర్తు చేసుకున్నారు. కొండ పాదానికి కుడివైపు కనిపిస్తున్న కాలిబాట వైపు చూపించి యిదే ఆ మార్గం అంటే యిదే అనుకున్నారు.

రావిచెట్టుకింద బాటసారులు కూర్చుని ఆయాసం తీర్చుకోడానికి వేదికలలాగా పెద్ద పెద్ద రాళ్ళు పరిచి వున్నాయి. రచ్చబండ రాళ్ళల్లా వున్న వాటిమీద కూర్చుని వున్నారు ఎక్కడెక్కడినుండో సింహాచలేశుడి దర్శనానికి వచ్చిన భక్తులు. త్రిలింగదేశం నలుమూలలనుండి వచ్చినట్లు వాళ్ళ రూపురేఖలు, కట్టుబొట్టు, మాట తీరూ చెబుతున్నాయి. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు అన్ని వయసులవాళ్ళు వున్నారు. దర్శనం చేసుకుని కొండదిగి వచ్చినవాళ్ళు వున్నారు. కొందరు దర్శనంకోసం కొండనెక్కాల్సినవాళ్ళూ వున్నారు.

దూర దూరంగా విడిచిన ఎడ్ల బండ్లు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి విశాలమైన ఆ రావిచెట్టుకు దూరంగా, చుట్టూతా. కాడి భారం వదిలిన వృషభాలు పొడవాటి తాళ్ళు అనుకూలించిన మేరా నెమ్మదిగా తిరుగుతూ పచ్చిక మేస్తుంటే ఆగకుండా లయబద్ధంగా వాటి మెడలలోని మువ్వలు మోగుతున్నాయి. ఆమూలా, ఈ మూలా పోగైన బైరాగులు పాడుతున్న యేవేవో తత్త్వాలకు వాద్య సహకారం అందిస్తున్నట్లు వున్నాయి ఆ మువ్వలమోతలు. జోడువాయిద్యాలలా మారాము చేస్తున్న పెంకిపిల్లల ఏడుపులు వినిపిస్తున్నాయి. పచ్చిక మేస్తున్న వృషభాలు కూడా రకరకాల ఆకృతులలో వున్నాయి. కొన్నిటి కొమ్ములు పెద్దగా విచ్చుకత్తులలా వున్నాయి. కొన్నిటికి కురచగా వేలెడంత వున్నాయి. తెల్లటి మంచు పర్వతాలలగా అంతెత్తున వున్నాయి కొన్ని. కొన్ని పొట్టిగా, చిన్నగా వున్నాయి.

ఒక బండమీద కూర్చుని వున్నాడు ఎవరో యాత్రీకుడు. పొద్దున్నే కొండమీద స్వామిని దర్శించుకుని వస్తున్నట్టున్నాడు. స్వామికి ఆరగింపు చేసిన దధ్యోదనం ప్రసాదాన్ని బాదం ఆకులలో పెట్టి భక్తులకు యిచ్చినట్టున్నారు ఆలయంలో. అరమోడుపు కనులతో ఆనందంగా ఆరగిస్తున్నాడు. వ్రేళ్ళు చీకుతూ, తన సమీపంలో కూర్చుని కలలో స్వామి యిచ్చిన ఆదేశాన్ని గురించి, కృష్ణమాచార్యుల గురించి తమలో తము చర్చించుకుంటున్న అన్నదమ్ములను చూసి పలకరింపుగా నవ్వాడు.

'ఎక్కడినుండి వస్తున్నారు స్వామీ' అని అడిగాడు అన్నదమ్ములను. తనూ పలకరింపుగా నవ్వుతూ 'అహోబిలం నుండి స్వామీ అని సమాధానమిచ్చాడు యోగానంద నరసింహుడు. 'తమరు?' అని అడిగాడు అతడిని. 'ఆలంపురం నుండి స్వామీ' అన్నాడు ప్రసాదానందం అనుభవిస్తున్న వ్యక్తి. అతడు నడివయసు వ్యక్తి. అరచెయ్యంత కుంకుమబొట్టు పెట్టుకుని వున్నాడు. చెవులకు కుండలాలు, మెడలో రుద్రాక్షలు, కట్టూ బొట్టూ చూస్తే అర్చకుడిలా వున్నాడు.

'చాలా దూరం! ఆ కొసనుండి ఈ కొసకు వచ్చారన్నమాట! స్వామి దర్శనం బాగా జరిగిందా?' అని అడుగుతూ లేచాడు. అతని తమ్ములూ లేచి కదిలారు. 'ఒక దర్శనం అయ్యింది. యింకొక దర్శనం కావాలి' అంటున్న అలంపురం వ్యక్తిని ప్రశ్నార్థకంగా చూస్తూ శెలవు అన్నట్టు చేతులు జోడించి తమ్ములతో కలిసి సాగిపోయాడు. కొంతసేపటికి విశాలమైన చెరువుకట్టను దిగి కొద్దిదూరంలో కనిపిస్తున్న పర్ణశాలను చూశారు. అదే కావచ్చు కృష్ణమాచార్యుల కుటీరం అనుకుంటూ వేగంగా దానిని సమీపించారు.

చుట్టూ వెదురు కంచె మధ్యలో అందమైన కుటీరం. అప్పుడే ఆరవేసినట్టున్న అంగవస్త్రాలు నీటి బిందువులను రాలుస్తూ చిరుగాలులకు ఊగుతున్నాయి. ఆవరణలో పూలమొక్కలు లాలన పాలన లేనట్టు వాడిపోయి వున్నాయి. నడుమెత్తు తులసికోటలో నాలుగు దళాలున్న కొమ్మ సగం ఎండిపోయి వున్నది. మిగిలిన చెట్టు మొత్తం ఎండిపోయి వున్నది. కుటీరం ముందు సంశయంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ ఒక్క క్షణం నిలుచుండిపోయారు అన్నదమ్ములు.

వీరి అలికిడి విన్నాడేమో, లోపలనుండి ఒక అందమైన యువకుడు బయటకు వచ్చాడు. కాషాయరంగు బట్టలలో సన్యాసిలా వున్నాడు. సన్యాస్రాశ్రమంలో వున్న మన్మథుడిలా వున్నాడు. 'కృష్ణమాచార్యులవారి కోసం అహోబిలం నుండి వచ్చాము స్వామీ' అన్నాడు యోగానందుడు. లోపలికి రమ్మన్నట్లుగా తల పంకించాడు ఆ యువకుడు. కూర్చొమ్మని అరుగులను చూపించాడు. అన్నదమ్ములు ముందుకు నడిచి మట్టి అరుగులమీద కూర్చున్నారు. వారికి అభిముఖంగా తనూ కూర్చున్నాడు. 'దాహం తీర్చుకుంటారా?' అని అడిగాడు. నున్నగా గుండుతో, గడ్డము మీసము లేకుండా, అప్పుడే తీర్చిదిద్దినట్లున్న ఊర్ధ్వపుండ్రాలతో వున్నాడతడు. అప్పుడే స్నానం చేసిన తడిని పూర్తిగా అద్దుకోనట్లు, భుజాలనిండుగా కప్పుకున్న ఉత్తరీయం కొద్దిగా చెమ్మగా వున్నది. చూసీ చూడగానే ఎక్కడో బాగా చూసిన వ్యక్తిలా అనిపించాడు అన్నదమ్ములకు.

'అహోబిలం నుండి వస్తున్నారా!' అని అడిగాడు. ఆ కంఠం కూడా బాగా విన్న కంఠంలా అనిపించింది.

'అవును స్వామీ! వీరు ఐదుగురూ నా తమ్ములు. అహోబిల నారసింహదాసులం. మాది పాతకమూరు..' అని యోగానందుడు అంటుండగానే అందుకున్నాడు జ్వాలానరసింహుడు.

'తమరు యింతకుముందు ఆ వేశ్యావాడలో కనిపించి మాతో మాట్లాడారు కదూ? కృష్ణమాచార్యులవారిని నిందించి, ఆయన కుటీరానికి దారి చెప్పింది మీరే కదూ? యింతలోనే కట్టూబొట్టూ మారిపోయాయే!' అన్నాడు ఆశ్చర్యంగా.

ఒక్క క్షణం చిన్నబుచ్చుకుని మౌనం వహించాడు ఆ యువకుడు. అంతే పెద్దపెట్టున రోదించడం ప్రారంభించాడు. ఉవ్వెత్తున గంగాప్రవాహంలా ఉబికి ఉబికి వస్తున్న కన్నీరు చెక్కిళ్ళ మీదుగా, కంఠాన్ని, వక్షస్థలాన్ని తడుపుతూ యింకిపోతున్నాయి. కదిలి కదిలి పెద్దగా రోదిస్తున్న తాకిడికి ఉత్తరీయం తొలిగిపోయింది. కన్నీటిలో తడిసి మెరిసిపోతూ పడగవిప్పిన నల్లత్రాచు ఆకారంలో వున్న పచ్చబొట్టులాంటి పుట్టుమచ్చ కనిపించింది.

'ఔను ! అక్కడ మీతో మాట్లాడింది నేనే! ఆ భ్రష్టుడిని, పతితుడిని నేనే! ఆ కృష్ణమాచార్యుడిని నేనే'

అని బిగ్గరగా 'నారసింహా! నారసింహా!' అని రోదించసాగాడు కృష్ణమాచార్యులు.

## (కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS